క్లుప్తంగా

ఘనంగా శ్రీ చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవ ఘనంగా జరిగింది. ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్ ఆధ్వర్యంలో ఉదయం శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన అభిషేకం అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి సంప్రదాయబద్ధంగా పల్లకీ సేవ నిర్వహించారు.

ఉచిత శిక్షణ

డోన్ టౌన్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్‌లో ట్యాలీ, జీఎస్టీ, స్పోకన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై బెంగళూరులో ఉచితంగా భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తూ శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 35 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. 18 నుండి 26 సంవత్సరాలలోపు టెన్త్, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్షయపై అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లె రూరల్ : క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని, బాధితులు తగిన జాగ్రత్తలు పాటించాలని స్థానిక ఏరియా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత సూచించారు. శుక్రవారం స్థానిక కేంద్రంలో నమోదైన బాధితులకు ప్రభుత్వం నుంచి అందించి పౌష్టికాహారాన్ని డాక్టర్ సుజాత అందజేశారు. డాక్టర్ సుజాత మాట్లాడుతూ పౌష్టి కాహారం తీసుకుంటూ మందులు వాడితే ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించుకోవచ్చన్నారు. టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయ పూజారి మృతి

కొలిమిగుండ్ల: స్థానిక కొండపై వెలసిన పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయ పూజారి, రిటైర్డ్ పీఈటీ బూడిదపాటి రాఘవయ్య(83) శుక్రవారం మృతి చెందాడు. నెల రోజులుగా కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి తెల్లవారుజామున విషమించడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స చేయకముందే కన్నుమూశారు. రాఘవయ్య మృతితో కొలిమిగుండ్లలో విషాదఛాయలు అలుముకున్నాయి. మైన్స్ అండ్‌జియాలజీ మాజీ డైరక్టర్ వీడీ రాజగోపాల్, తదిర ప్రముఖులు సంతాపం తెలిపారు.


19న శ్రీషిరిడీ సాయిబాబా మందిర రజతోత్సవ వేడుకలు

బనగానపల్లె : బనగానపల్లె అవుకు రోడ్డులోని ఎస్ఆర్‌బీసీ కాలనీలో ఉన్న శ్రీషిరిడీ సాయిబాబా మందిరం 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 19న రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు శ్రీరామ వెంకటసుబ్రహ్మణ్యం తెలిపారు. ఉదయం కాగడ హారతి,పాలాభిషేకం, శ్రీసాయి రథం ఊరేగింపు మధ్యాహ్న హారతి, సాయంకాల హారతి తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు.

తీరనున్న తాగునీటి సమస్య

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి సరఫరా అయ్యే బోరు బావిలో భూగర్భ జలాలు ఇంకిపోవడంతో తాగునీటి సమస్య తలెత్తింది. కాలనీవాసులు సమస్యను ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి దృష్టికి తీసుకెల్లడంతో బోరు మంజూరు చేశారు. శుక్రవారం ఉదయం బోరు వేయడంతో సమృద్ధిగా నీరు పడింది. మోటార్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీపీ, చైర్మన్ తెలిపారు.

పేద రైతులకు వరం వైఎస్సార్ జలకళ పథకం



పంపుసెట్లను అందజేస్తున్న ఎంపీపీ

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న వైఎస్సార్ జలకళ పథకం వరం లాంటిదని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముసలాయిచెర్వు డీ. లక్ష్మీదేవి, గూటుపల్లె లక్ష్మీదేవి మహిళా రైతులకు వైఎస్సార్ జలకళ పథకం కింద మంజూరైన మోటార్ పంప్ సెట్, స్టార్టర్ బాక్స్‌లను ఇన్‌చార్జి ఎంపీడీఓ దస్తగిరి బాబు ఆధ్వర్యంలో ఎంపీపీ అందజేశారు. గూటుపల్లె సర్పంచ్ శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి రంగస్వామి, రైతులు ప్రహ్లాదరెడ్డి, తిరుమలేష్, క్లస్టర్ టీఏ సాధిక్ బాషా పాల్గొన్నారు.

కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసులు

కోవెలకుంట్ల: సౌత్ ఇండియన్ కాపుసంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా కోవెలకుంట్లకు చెందిన శ్రీనివాసులును శుక్రవారం నియమించారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేల్పూరి శ్రీనివాసరావు అధ్యక్షతన ఈయనతోపాటు జిల్లా సెక్రటరీగా చౌదయ్య, ప్రధాన కార్యదర్శిగా పులిదామోదర్‌కు నియామక పత్రాలు అందజేశారు.

సాధికార యాత్రను జయప్రదం చేద్దాం

• ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: బనగానపల్లె పట్టణంలో ఈ నెల 22వ తేదీన నిర్వహించ తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మార్కెట్‌యార్డు రైతు విశ్రాంతి భవనంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారి సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీలకు రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో అత్యంత ప్రాధాన్యత కల్పించారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు గుర్తింపునిచ్చిన ఏకైన ముఖ్యమంత్రిగా ఘనత సాధించారన్నారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో టీడీపీ, బీజేపీ, జనసేన, తదితర పార్టీలు బీసీలను అందలం ఎక్కిస్తామని బూటకపు హామీలను గుప్పిస్తున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని మరెన్నో హామీలను అమలు చేసి బడుగు, బలహీన వర్గాల పక్షాన జగనన్న నిలిచారన్నారు. ఈ నెల 22వ తేదీన దాదాపు 10వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో నిర్వహించే సామాజిక సాధికార బస్సుయాత్రకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, కో ఆప్షన్‌మెంబర్ దిల్కా‌బాషా, మండల అధ్యక్షుడు బీవీ నాగార్జునరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ కో ఆప్షన్‌మెంబర్ ఎస్ఏ గఫూర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, లోకేశ్వర రెడ్డి, బాలమద్దిలేటి, రఘునాథరెడ్డి, మధుసూదన్ రెడ్డి, నాయకులు సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, ప్రసాద రెడ్డి, అమడాల శంకరయ్య, భాస్కర్‌రెడ్డి, డీవీ శేషిరెడ్డి, మోహన్‌రెడ్డి, వీరారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పోతం రాంమోహన్‌రెడ్డి, మాచిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, హరినాథరెడ్డి, ఎల్ఐసీ రామసుబ్బారెడ్డి, గుంజలపాడు రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి సోమవారం శ్రీశైలానికి ప్రత్యేక బస్సు

డోన్ టౌన్ : కార్తీక మాసం పురస్కరించుకుని డోన్ నుంచి శ్రీశైలం దేవస్థానానికి ప్రతి సోమవారం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల కోరిక మేరకు ప్రతి సోమవారం ఉదయం 6గంటలకు డోన్ కొత్త బస్టాండ్ నుంచి బస్సు బయలు దేరుతుందన్నారు. అదేరోజు శ్రీశైలంలో మధ్యాహ్నం 3గంటలకు డోన్‌కు బయలుదేరుతుందని చెప్పారు. పెద్దలకు రూ.380, పిల్లలకు రూ.200 చొప్పున నిర్ణయించామన్నారు. అదేవిధంగా శ్రీశైలానికే వెళ్లే 40 మంది ప్రయాణికులు ఉంటే ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తామని, మల్లన్న భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

21న జాబ్‌మేళా

కోవెలకుంట్ల: స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 21వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పది, ఐటీఐ, డిప్లమా, బీఫార్మసీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. 18 సంవత్సరాలు నిండి 30 సంవత్సరాల్లోపు వయసు అభ్యర్థులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

అవుకు: ప్రజారోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యనిస్తుందని, మారుమూల పల్లెలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందజేస్తుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం అవుకు పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన హెచ్‌డీఎస్ కమిటీ మీటింగ్‌కు ఎమ్మెల్యే కాటసాని హాజరయ్యారు. ముందుగా ఆసుపత్రికి మంజూరైన డెంటల్, ఆపరేషన్ థియేటర్ పరికరాలను పరిశీలించి సంబంధిత రూములను ప్రారంభించారు. అనంతరం కమిటీ మీటింగ్‌లో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆసుపత్రి అభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో ఒక్క డాక్టర్ మాత్రమే ఉండేవారని, ప్రస్తుతం అనస్థీషియా, సర్జన్, చిన్న పిల్లల వైద్యుడు, గైనకాలజిస్ట్, డెంటల్ డాక్టర్లతో పాటు మరో ముగ్గురు ఎంబీబీఎస్ డాక్టర్లు అందుబాటులో ఉన్నారన్నారు. అదేవిధంగా 6మంది స్టాఫ్ నర్సులు, 6మంది జీడీఏలు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్స్, రేడియో గ్రాఫర్ ఒకరు ఉన్నారని వివరించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే అన్ని వైద్య సేవలు అందజేసేందుకు చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. ఆసుపత్రికి జనరేటర్, త్రీ ఫేస్ కరెంట్ సౌకర్యం, సీజరీయన్ డెలివరీలకు పరికరాలు అవసరమున్నాయని డాక్టర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించారు. అలాగే ఆసుపత్రికి అదనంగా నిర్మించిన భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, డాక్టర్లు టి. రవికుమార్, జయరాముడు, కళ్యాణ్ శ్రీనివాస్, పి.రవికుమార్, అభినయ్, ఇందిరా కళ్యాణి, చాణక్య తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్ థియేటర్‌లో పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కామేశ్వరరావు

కోవెలకుంట్ల: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, బనగానపల్లె నియోజకవర్గ ఎలక్ట్రోలర్ ఆఫీసర్ కామేశ్వరరావు సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బూత్ లెవల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ ఫారం-6 ద్వారా ఓటు హక్కు నమోదు చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, సవరణలు చేసుకునే ఆస్కారం ఉందని, ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ల జాబితాలోని డబుల్ ఎంట్రీలను పకడ్బందీగా తొలగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పకుమారి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



వెంకటనారాయణను సన్మానిస్తున్న దృశ్యం

ప్యాపిలి: అంతర్జాతీయ రోయింగ్ క్రీడాకారుడు కొంగనపల్లె వెంకటనారాయణను శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు మాట్లాడారు. చైనాలో జరిగిన అంతర్జాతీయ పారా రోయింగ్ పోటీల్లో పాల్గొన్న వెంకటనారాయణ రజత పతకం సాధించడం మన దేశానికే గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు రామకృష్ణయ్య, సత్యబాబు, నవీన్, ముస్తాక్, నవీనపాటి, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, శంకరయ్య, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ మాధవరావు చౌదరి

బనగానపల్లె రూరల్ : రక్తహీతన వ్యాధిపై విద్యార్థినీ, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవరావు చౌదరి సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ విద్య విభాగం అధ్యాపకులు విజయకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాధవరావు చౌదరి రక్తహీనత ఏర్పాడడానికి కారణాలను వివరించారు. విటమిన్ సీ అధికంగా ఉండే అహారం తీసుకుంటే రక్తహీనత తలెత్తకుండా నివారించుకోవచ్చన్నారు. అనంతరం చీఫ్‌మెడిల్ ఆఫీసర్ మాధవరావుచౌదరిని విద్యార్థులు, అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్వర్ణలతదేవి, అధ్యాపకులు డాక్టర్‌బాబునాథ్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ బడేసాహెబ్, డాక్టర్ రామకృష్ణ, కౌలస్య, వరలక్ష్మీ, వాహీదా తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో క్రమశిక్షణ జీవితం

బనగానపల్లె రూరల్ : పుస్తక పఠనంతో క్రమశిక్షణ జీవితం అలవడుతుందని బనగానపల్లె గ్రంథాలయశాఖ అధికారి బషీర్ అహమ్మద్ అన్నారు. శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కవి సమ్మేళన కార్యక్రమం జరిగింది. తెలుగు కవి హరినాథ్‌గౌడ్, రిటైర్డ్ ఉపాధ్యాయలు శ్రీరాములు, అధ్యాపకులు ఎస్ఎండీ రఫీని కవి సమ్మేళన కార్యక్రమంలో భాగంగా సన్మానించారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం

బేతంచెర్ల: విద్యార్థులకు చదువుతోపాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం అని జెడ్పీ హైస్కూలు హెచ్ఎం అబ్రహం అన్నారు. శుక్రవారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో అధికారి మధు శేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్, కోకో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఈటీ రంగనాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి

డోన్ టౌన్ : విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోని ప్రవేశ పరీక్షల్లో రాణించాలని హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి, గ్రంథాలయం అధికారిణి రాధబాయి సూచించారు. పాతపేట జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం గ్రంథాలయం వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సెమినార్లు, కవి సమ్మేళనాలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : మండలంలోని జగదుర్తి సబ్ స్టేషన్‌లో మెయింటెన్స్ పనుల నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా మల్కాపురం 33 కేవీ ఫీడర్ కింద మధ్యాహ్నం 3 నుంచి సాయిత్రం 6గంటల వరకు, యు.కొత్తపల్లె సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా చేస్తామన్నారు.

సంజామల: మండల కేంద్రం సంజామల, ఆకుమల్ల, నొస్సం సబ్‌స్టేషన్ పీడర్ల పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ఆకుమల్ల, వసంతాపురం, కానాల, సంజామల, అక్కంపల్లె, నొస్సం గ్రామాలలో మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరుకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలోని సబ్ స్టేషన్ 33 కేవీ లైన్ మరమ్మతుల నేపథ్యంలో ఆర్ఎస్ రంగాపురం సబ్ స్టేషన్ మినహా మండల వ్యాప్తంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ మధు సూధన్ రెడ్డి తెలిపారు. పరిశ్రమల యజమానులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మసీదు మరమ్మతులకు నిధులు కేటాయించాలి



ఎమ్మెల్యే కాటసాని వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని జామియా మసీదు మరమ్మతులకు నిధులు మంజూరు చేయించాలని ముస్లింలు శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని కోరారు. ఈ మేరకు పట్టణంలోని ముస్లిం సోదరులు స్థానిక మార్కెట్ యార్డు చేరుకుని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేయగా నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణ శివారులోని షాదీఖానా నిర్మాణానికి రూ. 1.25 కోట్లు నిధులు విడుదల చేయించిన ఎమ్మెల్యేను ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, మండల కోఆప్షన్‌మెంబర్ దిల్కా‌బాషా, జిల్లా పరిషత్ మాజీ కో ఆప్షన్‌మెంబర్ ఎస్ఏ గఫూర్, మాజీ వార్డు మెంబర్ అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత



అభివృద్ధి పథకాల చిత్రాలను తిలకిస్తున్న దొరపల్లి గ్రామప్రజలు



దుర్గాపేటలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, చైర్మన్

డోన్ రూరల్ : మండల పరిధిలోని దొరపల్లి గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే .. కార్యక్రమంలో శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డిలు ప్రచార రథాన్ని ప్రారంభించారు. డోన్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను స్క్రీన్‌పై ప్రదర్శించారు. ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తిలకించారు. అనంతరం ప్రజలతో వారు మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. సీఎం సహకారంతో మంత్రి బుగ్గన డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు మీరు చూసిన అభివృద్ధి పనులు ఇంత వరకు ఎవ్వరూ చేయలేదన్నారు. అభివృద్ధి ఎవరైతే చేస్తారో వారికి మీ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాదేవి, ఎంపీటీసీ సుభద్రమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు చిరంజీవి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదల ఆర్థికాభివృద్ధి

బేతంచెర్ల: పేదల ఆర్థికాభివృద్ధి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే సాధ్యమని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని దుర్గాపేట కాలనీల్లో ఏపీకి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీల్లో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సారథ్యంలో కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు భాస్కర్, రమేష్, మురళీ, కృష్ణమూర్తి, మధు, నడ్డి శ్రీను , ఎద్దులన్న, జల్లా శ్రీను పాల్గొన్నారు.

పౌష్టికాహారం కిట్ల పంపిణీ

డోన్ టౌన్ : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం 31మంది టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టిక ఆహారం కిట్లను పంపిణీ పంపిణీ చేశారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో జలదుర్గం, కొత్త బురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వ్యాధి గ్రస్తులకు పవర్‌గ్రిడ్ సంస్థ సహకారంతో ఈ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుష్ ఏరియా విభాగధిపతి డాక్టర్ మాధవి, వైద్య సిబ్బంది అపర్ణ, సావిత్రి, భాగ్య, వెంకటేశ్వర్లు, కరీముల్లా,అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

నెలాఖరులోగా డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



డ్రైనేజీని పరిశీలిస్తున్న చైర్మన్ రాజేష్

డోన్ : పట్టణంలోని ఏడవ వార్డులో రైల్వే డబుల్ లైన్ పనుల మూలంగా ఏర్పడిన డ్రైనేజీ సమస్యను నెలాఖరులోగా పరిష్కరిస్తామని రైల్వే కాంట్రాక్టర్ హామీ ఇచ్చినట్లు మున్సిల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. డ్రైనేజీ మూలంగా ఇబ్బందులకు గురవుతున్నామన్న స్థానికుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆ ప్రాంతాన్ని చైర్మన్ పరిశీలించారు. మూడు ప్రాంతాల నుండి మాలిక్‌బాబా వద్ద వంకలో కలిసే డ్రైనేజీ పనులను చక్కదిద్దేందుకు తగిన సమయం కావాలని కాంట్రాక్టర్ కోరినందున నెలాఖరు వరకు గడువు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైస్‌చైర్మన్ కోట్రికె హరికిషన్, డీఈ రసూల్, ఏఈ సురేష్, టౌన్ ప్లానింగ్ అధికారి అంజాద్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గొడవ కేసులో రూ.5వేల జరిమానా

బనగానపల్లె రూరల్ : గొడవ కేసులో మండల పరిధిలోని టంగుటూరు గ్రామానికి చెందిన దేవర నాగేశ్వరరావుకు జడ్జి రూ.5 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి శుక్రవారం తెలిపారు. 2020లో దేవర నాగమ్మను దేవర నాగేశ్వరరావు దాడి చేసి, దుర్భాషలాడినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. బనగానపల్లె జూనియర్ కోర్టులో విచారణ అనంతరం రుజువు కావడంతో జడ్జి కిశోర్‌కుమార్ నాగేశ్వరరావుకు ఏడాది జైలు శిక్ష లేదా రూ.5 వేలు చెల్లించాలని తీర్పునిచ్చారన్నారు.

టీడీపీ తీరుపై... బీసీల తిరుగుబాటు!

టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న బీసీలు

- ఆయన వ్యక్తిత్వాన్ని సైతం తప్పుపడుతున్న వైనం
- సోషల్ మీడియా సాక్షిగా ఏకిపారేస్తున్న తెలుగు తమ్ముళ్లు
- బహిరంగంగానూ సవాళ్లు విసురుతున్న కేఈ ప్రభాకర్ వర్గం



డోన్: డోన్ నియోజకవర్గంలో టీడీపీ అధిష్టానం తీరుపై బీసీలు భగ్గుమంటున్నారు. బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసి కీలకపదవులు పొందిన మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి తనను ఇన్నేళ్లు నమ్ముకున్న వర్గాన్ని నట్టేటముంచి పత్తికొండకు వలసపోవడంపైనా ఆ పార్టీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ఆ కుటుంబానికి ఇక్కడి ప్రజలు గుర్తుకు వస్తారనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే అధిష్టానం ధర్మవరం సుబ్బారెడ్డిని ఇన్‌చార్జ్‌గా ప్రకటించడంతో పార్టీ నిర్ణయాన్ని బీసీలు తప్పుపడుతున్నారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టిన ధర్మవరం సుబ్బారెడ్డికి డోన్ టీడీపీ టికెట్ ఇస్తే ఊరుకునేది లేదని బీసీ సామాజికవర్గాల నాయకులు తేల్చిచెబుతున్నారు. ఏ అర్హతతో ఆయనకు బాధ్యతలు కట్టబెట్టారంటూ ప్రశ్నిస్తున్నారు. అక్రమ మద్యం, భూకబ్జా కేసులతో సంబంధం ఉన్న వ్యక్తులకా నాయకత్వం అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక సోషల్ మీడియా వేదికగా ధర్మవరం సుబ్బారెడ్డి వ్యక్తిత్వంపైనా విమర్శలు ఏకపారేస్తున్నారు కొందరు తెలుగు తమ్ముళ్లు. నువ్వెంత.. నీ గతం ఎవరికి తెలియదు... అంటూ విమ్మలు గుప్పిస్తున్నారు. అయితే టీడీపీ సీనియర్ నాయకుడు వెంకటరమణ ఆచారి సైతం ధర్మవరం సుబ్బారెడ్డి నాయకత్వాన్ని తప్పుపడుతూనే బీసీలకు ప్రాతినిధ్యం కరువైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో కనీసం బనగానపల్లె నియోజకర్గాన్నైనా బీసీలకు కేటాయించాలని కోరతున్నారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడికి లేఖ రాశారు. సోషల్ మీడియా వేదికగా టీడీపీ బీసీ నాయకులు చేసిన విమర్శలు కొన్ని ఇలా....

ససేమిరా అంటున్న కేఈ ప్రభాకర్ వర్గం

ఇక మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ వర్గం విషయానికి వస్తే ధర్మవరం సుబ్బారెడ్డి అభ్యర్థిత్వాన్ని ససేమిరా అంటున్నారు. డోన్ నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించినప్పటి నుంచి వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఆయనకు ఏ విధంగా బాధ్యతలు అప్పగించారంటూ భగ్గుమంటున్నారు. సుబ్బారెడ్డి నిర్వహించే పార్టీ కార్యక్రమాలకు సైతం దూరంగా ఉంటున్నారు. ఈ నెల 23న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ బర్త్‌డే... గ్రాండ్‌గా చేసేందుకు మాజీ కౌన్సిలర్ కోట్రికె ఫణిరాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కేశన్నగౌడ్ తదితర నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

స్వగ్రామంలో సెంటు భూమి ఇచ్చావా.....?



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి టీడీపీ సీనియర్ నాయకుడు తొప్పెల శ్రీనివాసులు. పార్టీ ఆవిర్భావం నుంచి జెండా మోశారు. ప్యాపిలి మాజీ ఎంపీపీ. సోషల్ మీడియా వేదికగా కనీసం సర్పంచ్‌గా కూడా గెలువని ధర్మవరం సుబ్బారెడ్డి నాయకత్వం ఏంటంటూ వ్యతిరేకిస్తున్న వ్యక్తి. ఎమ్మెల్యేగా గెలిస్తే రేషన్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ సెంటున్నర స్థలం మంజూరు చేస్తానని సుబ్బారెడ్డి ప్రజలను మభ్యపెడుతూ ప్రచారం చేస్తూ టీడీపీకి చెడ్డపేరు తెస్తున్నారని నిలదీస్తున్నారు. తన స్వగ్రామంలో కనీసం సెంటు భూమి ఇచ్చావా అని ప్రశ్నిస్తున్నారు. డోన్ నియోజకవర్గ వ్యాప్తంగా 30వేల మంది లబ్ధిదారులకు 4,500 ఎకరాలు ఎక్కడి నుండి తేగలరని సోషల్ మీడియా వేదికగా నిలదీస్తున్నారు.

– తొప్పెల శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ, ప్యాపిలి

బీసీల ద్రోహి .. ధర్మవరం సుబ్బారెడ్డి



ఈ వ్యక్తి.... ధర్మవరం సుబ్బారెడ్డి స్వగ్రామానికి చెందిన ధర్మవరం సంజీవుడు టీడీపీ సీనియర్ కార్యకర్త. ధర్మవరం సుబ్బారెడ్డి బీసీల ద్రోహి అంటూ... సోషల్ మీడియాలో నిత్యం ధ్వజమెత్తుతూనే ఉంటాడు. ముందుగా మా ఇరువురి స్వగ్రామం ధర్మవరంలో సర్పంచ్‌గా గెలిచి చూపాలని సవాల్ విసురుతూనే ఉంటాడు. తనతోపాటు ఎందరినో రాజకీయంగా ఎదగనివ్వని వ్యక్తి అని విమర్శలు చేస్తుంటాడు. బీసీలనే కాదు... నమ్మినవారినందరినీ తొక్కుకూంటూ ఎదిగిన వ్యక్తి అని బహిరంగంగా కూడా విమర్శలు చేస్తుంటారు. తన వ్యాపారాల అవసరానికి అనుగుణంగా పార్టీలు మారే వ్యక్తికి ఇన్‌చార్జ్ పదవి ఎలా ఇస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. బీసీలకు ప్రాధాన్యత ఇవ్వకుంటూ పెద్దఎత్తున తిరుగుబాటు తప్పదని హెచ్చరిస్తున్నాడు ధర్మవరం సంజీవుడు.

– ధర్మవం సంజీవుడు, టీడీపీ సీనియర్ కార్యకర్త, ధర్మవరం, డోన్